క్లుప్తంగా

రోడ్డు నిర్మించండి



దెబ్బతిన్న రోడ్డు

కల్లూరు: మండల పరిధిలోని ఉలిందకొండ నుంచి కొలంపల్లితాండకు వెళ్లే రోడ్డు కంకర తేలి అధ్వానంగా మారడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుపై నిత్యం ప్రజలు, పొలాలకు వెళ్లే వారు ప్రయాణిస్తుంటారు. భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో రోడ్డంతా గుంతల మయంగా మారిందని ప్రజలు వాపోయారు. రోడ్డుపై కంకర తేలడంతో బైకులు అదుపు తప్పే ప్రమాదం ఉందని, సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

సర్పంచ్‌కు పితృ వియోగం

ఓర్వకల్లు: మండలంలోని కన్నమడకల గ్రామానికి చెందిన వడ్డె తిక్కలి పెద్ద కాశీమన్న తండ్రి నడిపి రంగన్న (70) శనివారం మృతిచెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో మంచానపడిన ఆయన ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో శనివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి గ్రామానికి చేరుకొని మృతదేహానికి సంతాపం తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఎంపీటీసీ సోమశేఖర్‌రెడ్డి, తిక్కలి వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు నివాళులర్పించారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయండి



కె.నాగలాపురంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న అధికారులు

గూడూరు రూరల్: లబ్ధిదారులు గృహ నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ మాధవీలత సూచించారు. కె.నాగలాపురం జగనన్న కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను శనివారం ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. జగనన్న కాలనీలో 87 మంది లబ్ధిదారులకు ఇంటి స్థల పట్టాతో పాటు నిర్మాణానికి అవసరమైన లోన్ మంజూరు చేయడం జరిగిందన్నారు. లబ్ధిదారులందరూ గృహ నిర్మాణాలు చేపట్టారని, కొందరు గృహ ప్రవేశాలు కూడా చేయగా, మరికొన్ని ఇళ్లు బేస్‌మెంట్, లెంటిల్ లెవెల్, ఆర్‌సీ లెవెల్‌లో నిర్మాణాలు జరుగుతున్నాయని వివరించారు. లబ్ధిదారులకు అవసరమైన బిల్లులు, మెటీరియల్‌ను అందిస్తున్నామని, గృహాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. హౌసింగ్ ఏఈ జమ్మన్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి సౌందర్య వెంట ఉన్నారు.

మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించాలి

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు – గుంటూరు రహదారి విస్తరణ పనుల్లో కూల్చే ఇళ్ళకు నష్ట పరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. శనివారం కర్నూలు మండలం నందనపల్లె, భూపాల్‌నగర్, మిలిటరీకాలనీలో రోడ్ల విస్తరణ పేరుతో ఇళ్లు కూల్చే ప్రదేశాలను సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నారాయణ, మండల కార్యదర్శి ఉసేనయ్యతో కలిసి పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. ప్రజలకు నోటీసులు ఇవ్వకుండా రోడ్ల విస్తరణ పేరుతో ఇళ్లకు మార్కింగ్ వేసి వెళ్లారన్నారు. ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం న్యాయమైన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండల నాయకులు నగేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా అభివృద్ధి పనులు



అబ్బాస్‌నగర్‌లో డ్రైనేజీ నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

కల్లూరు: కల్లూరు అర్బన్ వార్డుల్లో అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. 27వ వార్డులోని అబ్బాస్ నగర్ కాలనీలో, కల్లూరు తహసీల్దార్ కార్యాలయం ముందు సీసీ డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వార్డులో ఆయా కాలనీలలో పర్యటించారు. నగరంలో ఆయా కాలనీలో ప్రాధాన్యతలను అనుసరించి అధికారులు అభివృద్ధి పనులు చేస్తున్నారు. కార్పొరేషన్‌లో పాలకవర్గం వచ్చాక నగరంలో అభివృద్ధి, తాగునీటి సమస్యలు పరిష్కరించడంతో నగరవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం అబ్బాస్ నగర్ కాలనీలో రూ.8 లక్షల నిధులతో సీసీ డ్రైనేజీ కాలువ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.

భానుడి భగభగలు

- తీవ్ర ఎండలతో బెంబేలెత్తుతున్న ప్రజలు
- పొంచిఉన్న వడదెబ్బ ముప్పు
- అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న వైద్యాధికారులు
- శరీరంలో నీటి శాతం తగ్గకుండా చూసుకోవాలని సూచన

కల్లూరు: ఎండలు మండిపోతుడడంతో ప్రజలు అల్లాడి పోతున్నారు. దాంతో పాటు వడగాలులు వీస్తుడడంతో బెంబేలెత్తున్నారు. సగటున మండలంలో 40 నుంచి 42 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచే ప్రచండ భానుడు నిప్పులు కక్కుతున్నాడు. సాయంత్రం 5 గంటల వరకు వేడిగాలులు ఏమాత్రం తగ్గడంలేదు. దీంతో ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు ప్రజలు జంకుతున్నారు. ఈ క్రమంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, పిల్లలు వీలైనంత వరకు మధ్యాహ్నం వేళ బయటకు వెళ్లకుండా చూసుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తే గొడుగు, ముఖానికి మాస్క్, కళ్లకు వైద్యులు సూచించిన అద్దాలు ధరించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి

వేసవి కాలంలో సాధ్యమైనంత ఎక్కువగా ద్రవ పదార్థాలు తీసుకోవాలి. ప్రతి ఒక్కరూ ఇంట్లో ఓఆర్ఎస్, గ్లూకోజ్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకోవాలి. రోజుకు కనీసం 15 గ్లాసుల నీరు తాగాలి. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, పిల్లలు మజ్జిగ, కొబ్బరి బొండాలు, రాగిజావ, రాగి అంబలి వంటివి తీసుకోవాలి. ద్రావణాలు ఎక్కువగా తీసుకోవడం ద్వారా శరీరంలో నీటి శాతం తగ్గకుండా ఉంటుంది. వేసవి కాలంలో మసాలా, అధిక నూనెతో తయారు చేసిన పదార్థాలకు ఎంత దూరం ఉంటే అంత మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. ఎండలు అధికంగా ఉన్న సమయంలో బయట తిరగరాదని మద్యం సేవించరాదని చెబుతున్నారు.

వడదెబ్బ లక్షణాలు

ఎండకు అధికంగా తిరగడం, ఎండలో పనిచేయడం, వేడి ప్రదేశాల్లో ఎక్కువ సేపు ఉండడం వల్ల వడదెబ్బ సోకుతుంది. వడదెబ్బ సోకిన వారికి శరీరం పాలిపోయి కళావిహీనమవుతుంది. శరీర ఉష్ణోగ్రత అత్యధిక స్థాయి చేరుకుని తర్వాత సాధారణ స్థాయి కన్నా తక్కువకు పడిపోతుంది. శరీరంలో లవణాలు తగ్గిపోవడంతో సమతుల్యత లోపించి తలనొప్పి, తల తిరగడం, జ్వరం, మత్తునిద్ర, ఫిట్స్ లేదా పూర్తి అపస్మారక స్థితి లక్షణాలు కనిపిస్తాయి. నీరు చెమట రూపంలో పోవడం నిర్జలీకరణ (డిహైడ్రేషన్) జరిగి మూత్రం రావడం కష్టమవుతుంది. కొన్ని సందర్భాల్లో షాక్‌కు గురై మూర్ఛపోవడం, మరణం కూడా సంభవిస్తుంది.

చికిత్స

వడదెబ్బ తగిలిన వ్యక్తికి దుస్తులు వదులు చేసి గాలి బాగా తగిలే ప్రదేశంలోకి తీసువెళ్లాలి. కాస్త సేద తీరిన తర్వాత సాధ్యమైనంత త్వరగా చల్లని ద్రవ పదార్థాలను తాగించాలి. శరీరమంతా తడిగుడ్డతో తుడవాలి. మజ్జిగ, ఉప్పు కలిపిన నిమ్మఎలక్ట్రోలైట్ ద్రావణం తాగించాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణం కంటే ఎక్కువగా ఉంటే వైద్యుల సూచన మేరకు మాత్రలు వేసుకోవాలి. షాక్‌కు గురైన సందర్భాల్లో పై ఉపశమన చర్యలు పాటిస్తూ వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాలి.



నిర్మానుష్యంగా మారిన 44వ జాతీయ రహదారి

శరీరంలో నీటి శాతం తగ్గకుండా చూసుకోవాలి



వేసవి కాలంలో ప్రజలు ఉదయం, సాయంత్రం సమయంలో మాత్రమే పనులు చేసుకోవాలి. శరీరంలో నీటి శాతం తగ్గకుండా ఎక్కువగా ద్రవ పదార్థాలు తీసుకోవాలి. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, పిల్లలు ఎండలో తిరగరాదు. ఎక్కువగా మజ్జిగ, కొబ్బరి బొండాలు, ఓఆర్ఎస్, గ్లూకోజ్ నీరు తీసుకోవాలి. వీటితో పాటు రాగి జావ, రాగి అంబలి తీసుకోవాలి. అనవసరంగా ఎండాల్లో తిరగరాదు. – ఉలిందకొండ పీహెచ్‌సీ వైద్యాధికారి, డాక్టర్ భాస్కర్ రెడ్డి

కేసీ కాల్వకు 189 క్యూసెక్కుల నీరు విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు 189 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు శనివారం డ్యాం అధికారులు తెలిపారు. కర్నూలు నగర ప్రజల తాగు నీటి అవసరాల కోసం ఈ నీటిని విడుదల చేసినట్లు వారు వెల్లడించారు. డ్యాంలో ప్రస్తుతం 1.152 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

గడివేముల: మండల పరిధిలోని కరిమద్దెల గ్రామం నుంచి 40 బస్తాల (ఒక్కోటి 50 కేజీలు) రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాల మేరకు.. బేతంచెర్ల గ్రామానికి చెందిన పూల నాగన్న, నంద్యాల మండలం ఉడుమల్పూరం గ్రామానికి చెందిన కంద్రి మారెన్న, గడివేములకు చెందిన నల్లబోతుల పెద్దన్న కరిమద్దెల గ్రామం నుంచి ఆటోలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారన్న సమాచారంతో దాడులు చేశారు. 40 ప్యాకెట్ల బియ్యం స్వాధీనం చేసుకుని రెవెన్యూ అధికారులకు సమాచారం అందించడంతో వారు పరిశీలించి రేషన్ బియ్యంగా నిర్ధారించారు. నిందితులు ముగ్గురిపై కేసు నమోదు చేసి ఆటోను సీజ్ చేసినట్లు ఎస్ఐ చెప్పారు. రేషన్ బియ్యాన్ని రెవెన్యూ సిబ్బందికి అప్పగించారు.

వలంటీర్ వ్యవస్థతో పారదర్శకత



సి.బెళగల్‌లో వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు

సి.బెళగల్: వలంటీర్ వ్యవస్థతో పరిపాలనతో పారదర్శకత పెరిగిందని, సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే చేరుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంపీడీఓ రాముడు అధ్యక్షతన ఈఓఆర్డీ సందీప్ గ్రామ వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వలంటీర్ల సేవలను కొనియాడారు.

ఓర్వలేకనే టీడీపీ విమర్శలు

సంక్షేమం, అభివృద్ధి పథకాలు పేద ప్రజలకు నేరుగా అందుతుంటే ఓర్వలేని ప్రతిపక్ష నాయకులు అనవసరంగా ప్రభుత్వం, అధికార పార్టీ నాయకులపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో 14 ఏళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన చంద్రబాబు ప్రజలకు ఏంచేశారో చెప్పుకోలేని దౌర్భాగ్య స్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు.

సత్కారాలు పొందిన వలంటీర్లు వీరే

మండల పరిధిలోని 16 సచివాలయాల పరిధిలో సేవలందిస్తున్న 232 మంది వలంటీర్లను ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్, అధికార యంత్రాంగం బ్యాడ్జిలు, మెడల్స్, ప్రశంసా పత్రాలు, శాలువాతో ఘనంగా సత్కరించారు. సి.బెళగల్–1 సచివాలయ పరిధిలోని మద్దిలేటి, సువర్ణ సేవా వజ్ర, సి.బెళగల్– 2 సచివాలయ పరిధిలోని మల్లేష్, పోలకల్ -1కు చెందిన గంపరాజు మద్దిలేటి, కొండాపురానికి చెందిన స్వేత, కంబదహాల్‌కు చెందిన మల్లికార్జున, ముడుమాలకు చెందిన మారెప్ప సేవా రత్న పురస్కారాలను అందుకున్నారు. అలాగే మండలంలోని 225 మంది సేవా మిత్ర పురస్కారాలను పొందారు. ఏఓ మల్లేష్‌కుమార్, కర్నూలు మార్కెట్ యార్డు డైరెక్టర్ ఎస్ఎం బాష, నాయకులు పాల్గొన్నారు.



సూదిరెడ్డిపల్లెలో లబ్ధిదారుడికి సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

టీడీపీ భూస్థాపితం ఖాయం

కర్నూలు (న్యూటౌన్): రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ భూస్థాపితం కావడం ఖాయమని ఎమ్మెల్యే సుధాకర్ అన్నారు. శనివారం కర్నూలు మండలం సూదిరెడ్డిపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరించి సంక్షేమ క్యాలెండర్లను అందజేశారు. గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ కాల్వల నిర్మాణం, మంచినీటి పైప్‌లైన్ వేయించాలని స్థానికులు కోరారు. త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, సర్పంచ్ విద్యాసాగర్, ఎంపీడీఓ భాస్కర్‌నాయుడు తదితరులు ఉన్నారు.

సంక్షేమ వారధులు వలంటీర్లు

కర్నూలు (న్యూటౌన్): ప్రతిఇంటికి సంక్షేమ పథకాలు అందించడం వలంటీర్ వ్యవస్థతోనే సాధ్యమైందని ఎమ్మెల్యే సుధాకర్ అన్నారు. శనివారం కర్నూలు మండలం వెంకాయపల్లెలోని శ్రీనివాస గార్డెన్‌లో 'వలంటీర్లకు వందనం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేకు నందనపల్లె సర్పంచ్ మాధురి, వెంకటేష్, మండలాధికారులు పూలమాలలు, బొకేలు అందజేసి స్వాగతం పలికారు. మండల పరిధిలోని 312 మంది వలంటీర్లకు సేవా మిత్ర, ఐదుగురికి సేవారత్న అవార్డులతో పాటు శాలువా, మెడల్స్‌తో సత్కరించారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు





భూపనపాడులో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, వలంటీర్ల సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పాణ్యం: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ప్రభుత్వం వైఎస్సార్‌సీపీనే అని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం భూపనపాడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయంలో జన్మభూమి కమిటీల పేరుతో ప్రజాధనాన్ని దోచుకున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక వలంటీర్ వ్యవస్థను తెచ్చి సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఇంటివద్దకే పంపుతుండడంతో వారి ముఖాల్లో చిరునవ్వు కనిపిస్తుందని చెప్పారు.

డ్రైనేజీ నిర్మాణానికి రూ.20 లక్షలు

బీసీ కాలనీలో సమస్యగా మారిన డ్రైనేజీ పరిస్థితిని స్థానిక మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. త్వరలోనే డ్రైనేజీ నిర్మించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. సోమవారం ఆర్‌అండ్‌బీ, పీఆర్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు కాలనీలో పర్యటించి మురుగునీరు ఏ మార్గంలో వెళ్లాలనే విషయంపై ప్రణాళికలు సిద్ధం చేస్తారన్నారు.

రైతులను పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కించిన ఘనత టీడీపీది

2014 – 2019 మధ్య టీడీపీ పాలనలో వర్షాలు రాక, ప్రాజెక్టుల్లో నీరు లేక రైతులు క్రాప్ హాలీడే ప్రకటించారని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి గుర్తుచేశారు. సాగు నీరు అందించేందుకు రైతులను పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కించిన ఘనత గత ప్రభుత్వానికే చెల్లుతుందన్నారు. అలాగే గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో వేల సంఖ్యలో కరువు గ్రామాలు, వందల సంఖ్యలో మండలాలు ఉండేవని, 2019లో సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక పుష్కలంగా వర్షాలు, నిండుకుండలా ప్రాజెక్టులు మారడంతో రెండు పంటలకు నీరు అందుతోందని, రాష్ట్రంలో ఒక్క కరువు మండలం కూడా లేదన్నారు. స్థానిక నాయకులు వెంట ఉన్నారు.

గ్రామాల అభివృద్ధిలో వలంటీర్లు కీలకం

గ్రామాల అభివృద్ధిలో వలంటీర్ వ్యవస్థ కీలకం అని ఎమ్మెల్యే కాటసాని అన్నారు. శనివారం భూపనపాడు గ్రామంలో వలంటీర్ల సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. మారుమూల గ్రామాల్లో సైతం రోజుల వ్యవధిలోనే సమస్యలు పరిష్కారం కావడంలో వలంటీర్ల సేవలు ఎనలేనివన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో లబ్ధిదారుల చెంతకు చేరుతున్నాయని వివరించారు.



హాజరైన వలంటీర్లు

విమర్శలను తిప్పికొట్టండి

ప్రస్తుతం ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో ప్రతిపక్ష పార్టీలు ప్రతి చిన్న విషయాన్ని రాజకీయం చేస్తున్నాయని, వాటి దుష్ప్రచారాన్ని వలంటీర్లు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాను ప్రజలకు వివరించాలన్నారు. మాజీ జెడ్పీటీసీ సద్దల సూర్యనారాయణ రెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, వైస్ ఎంపీపీలు వెంకటేశ్వర్లు, పార్వతమ్మ, సర్పంచ్ జనార్దన్, ఎంపీటీసీ సభ్యురాలు సుధారాణి, ఎంపీడీఓ దస్తగిరి, తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

సేవలు అమోఘం

గడివేముల: స్థానిక శ్రీ రాజరాజేశ్వరి పాఠశాలలో శనివారం వివిధ గ్రామాల వలంటీర్లను ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వలంటీర్ల సేవలను కొనియాడారు. అనంతరం మండలంలోని 189 మంది వలంటీర్లకు సేవామిత్ర, ఐదుగురికి సేవారత్న, ఇద్దరికి సేవా వజ్ర పురస్కారాలను ప్రదానం చేశారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రభుత్వ ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే కాటసాని హెచ్చరించారు. ఆర్ఐ శ్రీనివాసులుపై రైతులు, ప్రజలు వరుసగా ఫిర్యాదు చేస్తుండడంతో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతామన్నారు. వివిధ పనుల కోసం వచ్చే వారిని కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని అధికారులకు సూచించారు. పది రోజుల్లో గడివేముల ఎస్ఆర్‌బీసీ కాలనీలో నిరుపేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ చేస్తామన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ, సింగిల్‌విండో చైర్మన్ చంద్రశేఖరరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, ఈఓఆర్డీ ఖాలీక్, తదితరులు పాల్గొన్నారు.

మరింత బాధ్యతగా సేవలందిస్తా



ప్రభుత్వం తన సేవలను గుర్తించి సేవా వజ్ర పురస్కారం అందించడం ఎంతో ఆనందంగా ఉంది. నాకు కేటాయించిన 50 కుటుంబాలకు మరిన్ని సేవలను ఉత్సాహంగా అందిస్తాను. ఏటా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి వలంటీర్ పనితనాన్ని గుర్తించి ప్రోత్సాహకాలు అందించడం వల్ల ఇంకా బాగా పనిచేయాలనే ఉత్సాహం కలుగుతుంది.

– స్వప్న, గ్రామ వలంటీర్, బూజునూరు

ఫ్లై ఓవర్ వంతెన నిర్మించాలి

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు బంగ్లా బస్టాండ్ వద్ద 'ఫుట్ వే వంతెన వద్దు – ఫ్లై ఓవర్ వంతెన ముద్దు' అంటూ సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. శనివారం జాతీయ రహదారిపై ఫుట్ వే వంతెన నిర్మాణ పనులు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న సీపీఎం జిల్లా నాయకులు రామకృష్ణ, మండల కార్యదర్శి నాగన్న, మధుసూదన్ అక్కడికి చేరుకొని పనులను అడ్డుకొని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. నిత్యం వందలాది మంది ప్రయాణికులతో రద్దీగా ఉండే జాతీయ రహదారిపై ఫ్లైవర్ వంతెన నిర్మించాలని గత కొన్నేళ్లుగా పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. సమస్యను గతంలో హైవే అథారిటీ, మండల అధికారులు, కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ప్రస్తుతం ఫ్లై ఓవర్ వంతెనకు బదులుగా రూ.1.30 కోట్లతో ఫుట్ వే వంతెన నిర్మాణానికి పనులను ప్రారంభించడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఈ వంతెన నిర్మాణం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. ప్రజల సౌకర్యార్థం ఫ్లై ఓవర్ వంతెనగానీ, అండర్ బ్రిడ్జిని గానీ నిర్మించాలని ఆర్‌ఈపీఎల్ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. నాయకులు మగ్బూల్ జహా, మాసూంబాష, సలాంబాష, నాగరాజు, బషీర్ తదితరులు పాల్గొన్నారు.



హైవే అధికారులకు వినతి పత్రం సమర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఈదురుగాలుల బీభత్సం

గడివేముల: మండల పరిధిలోని చిందుకూరు, గడిగరేవుల గ్రామాల్లో శనివారం సాయంత్రం భారీగాలులు, మెరుపులతో కురిసిన వర్షానికి గ్రామాల్లో చెట్లు నేలకూలాయి. ఉదయం నుంచి ఎండ అధికంగా ఉండటంతో పాటు ఉక్కపోతతో జనం అల్లాడిపోయారు. ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు రావడంతో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షం కురిసింది. ఈదురుగాలులకు గడిగరేవుల గ్రామానికి వెళ్లే రహదారిపై చెట్లు విరిగిపడడంతో రాకపోకలు స్తంభించాయి. గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. విద్యుత్ శాఖ అధికారులు సరఫరా పునరుద్ధరించే పనుల్లో నిమగ్నమయ్యారు.



గడిగరేవులలో రోడ్డుపై విరిగిపడిన చెట్టు

రైతులకు ఇబ్బంది లేకుండా చూడండి

గడివేముల: మండల పరిధిలోని గని గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 910లో రైతులు పొలాలు సాగు చేసుకుంటున్న ప్రాంతంలో రాయిని తోలుకునేందుకు అనుమతులు మంజూరు చేయరాదని రైతులు తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. శనివారం గని, ఎల్‌కే తాండ గ్రామాలకు చెందిన ఈశ్వర్‌నాయక్, రాములునాయక్, నాయనాయక్, ప్రతాప్‌రెడ్డి, వెంకటరమణ, క్రిష్ణ, శివరామకృష్ణ తదితర రైతులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ.. 910 సర్వే నంబర్ చుట్టూ మామిడి తోటలు ఉన్నాయని, రాయిని తీసుకునేందుకు అనుమతులు ఇస్తే తాము తీవ్రంగా నష్టపోతామన్నారు. దీనిపై ఈ నెల 1వ తేదీన నంద్యాల జిల్లా కలెక్టర్‌కు స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

అధ్వానంగా సర్వీసు రోడ్డు



కేఆర్‌ఆర్ పాఠశాల వద్ద రోడ్డుపై లోతైన గుంతలు పడిన దృశ్యం

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలోని సర్వీస్ రోడ్లు పూర్తి అధ్వనంగా మారాయి. దీంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతన్నారు. నంద్యాల-పాణ్యం వచ్చే సర్వీస్ రోడ్డు పూర్తిగా దెబ్బతింది. పాతచందమామ హోటల్ వద్ద రోడ్డుపై భారీ గుంతపడి అందులో నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే కర్నూలు నుంచి పాణ్యం వచ్చే సర్వీస్ రోడ్డుపై ఈద్గా వద్ద రోడ్డు పెచ్చులూడిపోయింది. అలాగే బస్టాండ్ వద్ద కేఆర్ఆర్ పాఠశాల వద్ద భారీ గుంతపడింది. అక్కడ పైపులైన్ ఉండండతో వాహనాల ధాటికి పైపులు పగిలి నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. అడుగుపైనే గుంత ఉండటంతో ఏ మాత్రం అదమరిచినా వాహనాదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. హైవే అధికారులు చొరవ తీసుకొని రోడ్డును బాగుచేయాలని వాహనదారులు కోరతున్నారు.

గ్రామాభివృద్ధిని అడ్డుకుంటే చర్యలు

సి.బెళగల్: మండలంలోని గ్రామాలలో అభివృద్ధి పనులను, ప్రభుత్వ కార్యక్రమాలను ఎవరైనా అడ్డుకుంటే కఠిన చర్యలు తప్పవని ఈఓఆర్డీ సందీప్ హెచ్చరించారు. మండల పరిధిలోని గుండ్రేవులలో కొంతమంది మురుగు కాలువను పూడ్చి సమస్యలు సృష్టిస్తున్నారన్న ఫిర్యాదు మేరకు ఆయన శనివారం పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌తో కలిసి గ్రామంలో పర్యటించారు. సమస్య ఉన్న ప్రాంతాల్లో స్థానికులకు పంచాయతీరాజ్ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన దగ్గరుండి మురుగు కాలువలో వేసిన పూడికను పారిశుద్ధ్య కూలీలతో తొలగించి సమస్యను పరిష్కరించారు. మరోసారి పంచాయతీ పనులను అడ్డుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, స్థానికులు ఉన్నారు.



గుండ్రేవులలో సమస్యను పరిష్కరిస్తున్న ఈఓఆర్డీ

కోన వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు

సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన కోన వేంకటేశ్వర స్వామి వారికి శనివారం పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల అనంతరం ప్రతి శనివారం స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో కొండపై ఆలయంలోని భూదేవి, అలివేలి మంగమ్మ సమేత కోన వేంకటేశ్వర స్వామి మూల విగ్రహాలకు అభిషేక పూజలతో పాటు ప్రత్యేక పుష్ప, పత్రాలతో అలంకరించి పూజా కార్యక్రమాలను చేపట్టారు. గ్రామస్తులతో పాటు, సి.బెళగల్, బురాన్‌దొడ్డి, పుల్లకూర్తి, పోలకల్, ఇనగండ్ల గ్రామాలకు చెందిన భక్తులు కొండపైకి చేరి ఉదయం నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు స్వామి వారికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.



పూజలందుకుంటున్న కోన వేంకటేశ్వర స్వామి

భారీ వాహనాలను గ్రామంలోకి రానివ్వొద్దు

గడివేముల: మండల పరిధిలోని జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీకి రాకపోకలు సాగించే భారీ వాహనాలతో నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని స్థానిక వ్యాపారులు ఆరోపిస్తున్నారు. శనివారం గడివేముల పాతబస్టాండ్ వద్ద వ్యాపారులు రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీకి సంబంధించిన రోడ్డులోనే భారీ వాహనాలు వెళ్లాలన్నారు. నిత్యం వందలాది వాహనాలు గ్రామంలోకి వస్తుండటంతో పాతబస్టాండు ప్రాంతంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగి ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. అనంతరం గ్రామంలోకి భారీ వాహనాలు రాకుండా చూడాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



గడివేముల పాతబస్టాండు వద్ద ధర్నా నిర్వహిస్తున్న చిరువ్యాపారులు